# మరణానికి ఆహ్వానం

కోదండపాణి చివరి ఉత్తరాన్ని రాయడం మొదలుపెట్టాడు. అప్పటికి ఆయన పదహారు ఉత్తరాలను రాశాడు. ఆయన ఎదురుగా ఉన్న చెక్క బల్లమీద ఆయన సమీప బంధువుల స్నేహితుల పేర్లు, చిరునామాలు ఉన్న కాయితం ఉన్నది. ఒక్కో ఉత్తరం రాయడం పూర్తి చేసినప్పుడల్లా ఆ కాయితంలో ఒక్కో పేరును కొట్టివేస్తూ వచ్చాడు. చివరగా ఆయనతో పాటు ఉద్యోగం చేస్తూ ఈ మధ్యనే బదిలీ మీద మరో ఊరికి వెళ్లిన స్నేహితుడు సత్యనారాయణకు ఆఖరి ఉత్తరాన్ని రాయడం ప్రారంభించాడు కోదండపాణి.

ప్రియమిత్రుడు సత్యనారాయణకు-

కులాసా అని తలుస్తాను. ముఖ్యంగా వ్రాయునది-నేను కార్తీక బహుళ ద్వాదశి శనివారం నాడు చనిపోతున్నాను. ఇది ముమ్మాటికీ నిజం.

నా మరణ సమయం గురించి నాకు బాగా తెలుసు. ఇంకో వారం రోజుల్లో-

ఇలా రాసి కింద సంతకం చేసి ఆ ఉత్తరాన్ని మడిచి కవర్లో పెట్టి అడ్రసు రాసి కవరును జిగురుతో అంటించి బల్లమీద పడేశాడు.

కోదండపాణికి నిద్ర వస్తున్నట్లుగా అనిపించి ఎదురుగా ఉన్న గోడ గడియారాన్ని చూశాడు. రాత్రి ఒంటిగంట కావస్తోంది. ఇంట్లో అంతా నిద్రపోతున్నారు. ఆయన ఒక్కడే మేలుకుని ఉన్నాడు.

ఉత్తరాలు రాయడం పూర్తయిన తర్వాత కుర్చీలో నుంచి లేచి ఆ గదిలో లైటార్పి తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఆయనకు ఎంత సేపటికీ నిద్ర రాలేదు. తను మొత్తం పదిహేడు మందికి ఉత్తరాలు రాసాడు. ఇందులో ఎంతమంది తన మరణవార్తను నమ్ముతారు? ఎంతమంది తన చావును చూడటానికి వస్తారు? ఆయన ఇలా ఆలోచించసాగాడు.

ఏది ఏమైనా కార్తీక బహుళ ద్వాదశి శనివారం రోజున తను చనిపోవటం ఖాయం. అందులో మార్పులేదు.

కోదండపాణికి ఆయన చిన్నతనంలో తన నాయనమ్మ, ఆమె తాతగారి మరణం గురించి చెప్పిన విషయం మళ్లీ గుర్తుకు వచ్చింది. ఆమె తాతగారు తను చనిపోతానని చెప్పిన రోజున ఇంటిముందున్న బాదం చెట్టుకింద చాప పరుచుకుని ఉత్తర దిక్కుగా తల ఉంచి పడుకుని చనిపోయాడుట. తన చిన్నతనంలో ఇటువంటి విషయాలనే ఆయన మరికొన్ని విన్నాడు. కొంతమందికి తమ మరణ సమయం గురించి ముందుగానే తెలుస్తుందట. ఇందుకు సరైన రీజనింగు లేకపోయినా ఇది నిజం. ఇప్పుడు కోదండపాణికి కూడా అంతే. కోదండపాణికి జ్యోతిష్యశాస్త్రం మీద నమ్మకంతో పాటు కొంత ప్రవేశం కూడా ఉంది. ఆయనకు ఇంతకుముందు జ్యోతిషం గురించి బాగా తెలిసినవాళ్లు ఆయన జాతకం చూసి ఆయనకు యాభై నాలుగవ ఏట మరణం ఉన్నదని చెప్పారు. ఇప్పుడు కోదండపాణికి యాభైనాలుగేళ్లు. ఆ రాత్రి కోదండపాణి చాలా ఆలస్యంగా నిద్రపోయాడు. ఆయన అలా ఉత్తరాలు రాసినట్టుగా ఇంట్లో ఎవరికీ తెలీదు. ఆ ఉత్తరాలను కోదండపాణి తెల్లారి వాళ్ల ఇంటికి దగ్గరలో వున్న పోస్టాఫీసుకి తీసుకువెళ్లి పోస్టుబాక్సులో పడేసాడు. ఆపైన నాలుగు రోజులకు కోదండపాణి ఉత్తరాలు రాసిన కొంతమంది దగ్గరనుంచి ఆయన కొడుకు రాజకిరణ్‌కు ఉత్తరాలు వచ్చాయి. అందులో వున్న విషయాన్ని చదివి కొడుకు ఆశ్చర్యపడి–

"నాన్నా! ఏమిటి ఇదంతా?" అని అడిగాడు.

"వాళ్లందరికీ నిజమే రాశాను" అన్నాడు కోదండపాణి.

"ఇంపాసిబుల్. ఏ మనిషీ తన మరణ తేదీని తెలుసుకోలేదు. మరణం ఒక రహస్యం. అంతేకాకుండా నీలో ఎటువంటి అనారోగ్యమూ లేదు" అన్నాడు.

అప్పుడు కోదండపాణి నవ్వి "మరణానికి అనారోగ్యంతో పనిలేదు. కొంతమందికి మరణ సమయం ముందుగానే తెలుస్తుంది. దాని గురించి నాకు తెలిసి కొన్ని దృష్టాంతాలున్నాయి. అయినా నువ్వన్నట్టుగా ఒక మనిషికి అనారోగ్యం కలగటానికి ఎంత సమయం కావాలి?" అని ఎదురు ప్రశ్నించాడు.

"నిజమే కావచ్చు. కానీ నమ్మశక్యంగా లేదు. అనిపించటం వేరు, జరగటం వేరు. నా మటుకు నేను నమ్మటం లేదు. నువ్వు ఉత్తరాలు రాసిన వాళ్లలో కూడా ఎవరూ నమ్మరు. ఇప్పుడు నాకు ఉత్తరాలు రాసిన వాళ్లు కూడా నమ్మటం లేదనే రాసారు. పైగా నీకు మతి చలించినదనే సందేహాన్ని కూడా వ్యక్తపరిచారు. ఇంకెవరికీ ఇలా ఉత్తరాలు రాయవద్దు. హాస్యాస్పదంగా ఉంటుంది" అన్నాడు రాజకిరణ్. ఆ విషయమై ఆ తర్వాత కోదండపాణి భార్య, ఇంకో కొడుకు, ఇద్దరు కూతుళ్లూ ఆయనతో వాదించారు.

కార్తీక బహుళ ఏకాదశి–శుక్రవారం.

ఆ రోజున కోదండపాణి బంధువులు, స్నేహితులు ఆయన ఇంటికి వచ్చారు. వాళ్లలో ఏ ఒక్కరికీ కోదండపాణి ఆ మర్నాడు చనిపోతాడనే నమ్మకం లేదు. కానీ అసలు ఏం జరుగుతుందో చూద్దామనే ఆసక్తితో వచ్చారు. కానీ వాళ్లతో మాట్లాడుతూ తను చెప్పినట్టుగానే చనిపోతాననీ, తనకు గట్టి నమ్మకం ఉన్నదనీ చెప్పాడు కోదండపాణి. అయినా వాళ్లు నమ్మలేదు. పైగా నవ్వారు కూడా.

ఆ రాత్రి గడిచింది. ద్వాదశి–శనివారం ప్రవేశించింది.

కోదండపాణి తెల్లవారుజామునే లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసాడు. తర్వాత దేవుడి మందిరం ఎదుట కూర్చుని సంధ్యావందనం చేసుకుని, రోజులాగే కొంతమంది దేవుళ్లకు పారాయణ చేసి ఇదే తన ఆఖరి పారాయణ అని చెప్పాడు. నుదుటి మీద విభూతి, పెద్ద కుంకుమబొట్టు పెట్టుకున్న కోదండపాణి తనవాళ్లతో కొంచెం సేపు ముచ్చటించి తర్వాత ఉదయం తొమ్మిది గంటలు కావస్తున్నప్పుడు–ఒక చింకి చాపను వరండాలో పరచుకొని ఉత్తర దిక్కుగా తల ఉంచి వెల్లకిలా పడుకున్నాడు. చేసేది లేక వచ్చిన వాళ్లంతా ఆయన చుట్టూ కూర్చున్నారు. అప్పుడు కోదండపాణి భార్య కన్నమ్మ భర్త పాదాల దగ్గర కూర్చుని పాదాలు నొక్కటం మొదలుపెట్టింది.

"అంతిమ పాదసేవ చేస్తున్నావా కన్నమ్మా!" అని అడిగాడు కోదండపాణి. ఆమెకు ఏడుపు వచ్చింది.

ఈ తతంగమంతా చూస్తున్న వాళ్లంతా కోదండపాణికి నిజంగానే మతి చలించినదని అనుకున్నారు.

"నాన్నా! నీకు పిచ్చి పట్టింది" అన్నాడు కోదండపాణి ఇంకో కొడుకు.

ఆయన నవ్వి "ఈ పిచ్చివాడు ఇంకొంచెం సేపట్లో మరణించబోతున్నాడు" అన్నాడు శూన్యంలోకి చూస్తూ.

ఆ సమయంలో కోదండపాణికి ఆకాశంలో నుంచి ఒక దివ్యపురుషుడు కాంతులీనుతూ దిగి వరండా మెట్లమీదకు వచ్చి నిలబడటం కనపడింది. ఆయన పక్కగా మరికొంతమంది ఆయనకు బాగా తెలిసినవాళ్లు కూడా కనిపించారు. వాళ్లు ఎవరో కాదు. కోదండపాణి ఎంతగానో అభిమానించే ఆయన తండ్రి, బాబాయి, మేనత్త, ఒకరిద్దరు స్నేహితులు. వాళ్లంతా ఎప్పుడో చనిపోయిన వాళ్లు.

వెంటనే కోదండపాణి వరండా మెట్లవైపు రెండు చేతులూ జోడించి నమస్కారం చేస్తూ–

"మహానుభావా! నన్ను నీ లోకానికి ఆహ్వానించటానికి తీసుకువచ్చావా? నువ్వెంత దయగలవాడివి. చావంటే నేను భయపడతానని, ఆ భయం పోగొట్టి నేను ఎంతో

అభిమానించే నా వాళ్లను కలుసుకోవటానికి మరో లోకానికి వెళుతున్నాననే ధైర్యం చెప్పటం కోసం నా తండ్రిని, బాబాయిని, మేనత్తని, నా స్నేహితులను కూడా వెంట తీసుకుని వచ్చావా? మరణానికి కూడా ఇంతటి మధురమైన స్వాగతం ఉన్నదా? కృతజ్ఞుడిని తండ్రీ" అంటున్నాడు కోదండపాణి.

ఆయన చుట్టూ వున్నవాళ్లంతా ఆ వైపుకి చూసినప్పుడు వాళ్లకు అక్కడ ఎవరూ కనపడలేదు. శూన్యం దర్శనమిచ్చింది. కోదండపాణికి నిజంగానే పిచ్చిపట్టిందని వాళ్లంతా రూఢి చేసుకున్నారు. కొంతమందికి ఆ సన్నివేశం ఆసక్తికరంగా ఉండి, ఇంకా ఏం జరుగుతుందో, ఆ సన్నివేశం ఎలా ముగుస్తుందో చూడాలని అనుకున్నారు. కోదండపాణి తిరిగి మాట్లాడటం మొదలు పెట్టాడు. మళ్లీ వరండా మెట్లవైపు చూసాడు నిశితంగా. దివ్యపురుషుడు, మిగిలిన వాళ్లంతా కోదండపాణిని ఆహ్వానిస్తున్నట్లుగా చేతులు చాపారు.

"చావు గురించి-నా చావు గురించి ఎవ్వరూ బాధపడకండి. నా సంతానాన్ని వదిలి, నాకంటే ముందుగానే చనిపోయిన నా వాళ్లున్న మరో లోకానికి వెళుతున్నాను. నాకు బాధలేదు. కేవలం ప్రదేశాన్ని మారుతున్నాను. నాకు చాలా సంతోషంగా వుంది. నా వాళ్ళంతా నన్ను వాళ్ల లోకానికి ఆహ్వానిస్తున్నారు. తిరిగి నా వాళ్లను కలుసుకోవటానికి వెళుతున్నాను."

కోదండపాణి తల వాల్చేసాడు. తర్వాత మాట్లాడలేదు. ఆయనలో చలనం ఆగిపోయింది. కోదండపాణి నిజంగానే చనిపోయాడని నిర్ధారణ చేసుకున్న తర్వాత వాళ్లంతా ఆశ్చర్యపడకుండా ఉండలేకపోయారు.

*(చిత్ర మాసపత్రిక కథల సంపుటి అక్టోబరు 2009)*